క్లుప్తంగా

నేడు సినీ దర్శకుడు అనిల్ రావిపూడికి పురస్కారం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గల స్వామి వివేకానంద సెమినార్ హాలులో శనివారం సుప్రసిద్ధ చిత్రకారుడు, దర్శకుడు బాపు జయంతి సందర్భంగా 'బాపు-రమణ-బాలు కళాపీఠం' నిర్వహణలో బాపు స్మారక పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు డాక్టర్ రమణ యశస్వి ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సభలో సినీ దర్శకులు అనిల్ రావిపూడికి బాపు స్మారక దర్శక కేసరి పురస్కారం, ప్రసిద్ధ చిత్రకారులు చిదంబరం, రామశాస్త్రి, కార్టూనిస్టు బొమ్మనకు బాపు స్మారక పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కవులు, రచయితలు, కార్టూనిస్టులు, చిత్రకారులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

అసత్య రాతలు రాస్తే ప్రజలు క్షమించరు

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: దురహంకార రాతలకు రామోజీరావు క్షమాపణ చెప్పాలని తూర్పు నియోకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా డిమాండ్ చేశారు. బైజూస్ కంటెంట్ రాతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెత్తందారుల పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు ఉంటే పేద విద్యార్థులకు అవసరం లేదా? అని ప్రశ్నించారు. గతంలో సైతం పేద పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం విద్య ప్రవేశపెడితే ఇలాగే వ్యతిరేకించారని, వారి పిల్లలు తెలుగు మీడియంలోనే చదువుతున్నారా ? అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు మనషుల్లా కనబడడం లేదని మండిపడ్డారు. ఇంగ్లిషు, డిజిటల్ విద్య పేద పిల్లలకు చెబితే ఓర్చుకోలేక ఇష్టానుసారంగా రాతలు రాస్తున్నారని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల్ని బాధ్యతగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చదివిస్తుంటే ఇష్టానుసారంగా లేనిపోని రాతలు రాసి ప్రజల్ని అయోమయస్థితిలోకి నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విషపు రాతలు మానుకోవాలని, లేదంటే ప్రజలు బుద్ధి చెబుతారని ముస్తాఫా హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: విద్యుత్ లైనుల మరమ్మతుల దృష్ట్యా నెహ్రూనగర్ ఉపకేంద్రం పరిధిలోని పలు కాలనీల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డెప్యూటీ ఇంజినీర్ పీహెచ్.ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాద్రి, న్యూ రైల్వే స్టేషన్ రోడ్డు, నెహ్రూనగర్‌లోని 8, 9, 10, 11 లైనులకు సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

జీజీహెచ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆస్పత్రిలోని శుశ్రుత హాలులో జీజీహెచ్ నర్సుల అసోసియేషన్, హెడ్‌నర్సు రోజ్‌రాణి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు . ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభువైన యేసుక్రీస్తు శాంత మూర్తి అని, ఆయన బోధనలు అందరికీ అనుసరణీయమని తెలిపారు. ఒకరినొకరు అర్థం చేసుకుని సహనం, పట్టు విడుపులు ఉంటే జీవితం సాఫీగా నడుస్తుందని చెప్పారు. తొలుత సిబ్బంది పలు క్రిస్మస్ గీతాల్ని ఆలపించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్లు కె. ఆశా సజని, సమీనా బేగం, కిరణ్మయి, పద్మ, పాస్టర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

అరుణ్ కుమార్‌కు ఘంటసాల పురస్కారం



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక, కాపునాడు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు ఘంటసాల పాటల్ని ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. అనంతరం కళావేదిక వ్యవస్థాపకులు మిరియాల ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సామాజిక సేవాతత్పరులు నిశంకరరావు అరుణ్ కుమార్‌కు ఘంటసాల జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా కాపునాడు పార్లమెంట్ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మేకల పురుషోత్తం ప్రసాద్ పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం యువతకు ఆదర్శనీయం

- ఎమ్మెల్యే ముస్తఫా
- పొట్టి శ్రీరాములుకు ఘననివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా తదితరులు



పొట్టి శ్రీరాములు విగ్రహనికి నివాళులర్పిస్తున్న షేక్ సజీల

పట్నంబజారు: మహనీయుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని హిందూ కళాశాల కూడలిలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా, నూరి ఫాతిమా మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కీర్తించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శనీయమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఆర్యవైశ్య సంఘాల నేతలు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరవలేనిది

నెహ్రూనగర్: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరవలేనిదని డెప్యూటీ మేయర్ షేక్ సజీల పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని హిందూ కాలేజీ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అహింసా మార్గంలో అమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు కారకులైన పొట్టి శ్రీరాములు ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్మరణీయులుగా మిగిలి పోయారని కొనియాడారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఘన నివాళి

లక్ష్మీపురం: పొట్టి శ్రీరాములు త్యాగం అసమానమని, ఆంధ్రుల మదిలో చిరస్మరణీయులని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది అవధానుల హరి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యావేత్త సింగరయ్య

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపం

ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మితో మాట్లాడుతున్న అంబటి రాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్ని అన్ని హంగులతో ఆధునీకరించిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలకు కొత్త రూపం తెచ్చారని, ఆధునిక డిజిటల్ చదువుల్ని తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాడు-నేడుతో పాఠశాలలో కల్పించిన వసతులు, ఆధునీకరించిన పాఠశాల భవన సముదాయాన్ని పరిశీలించారు. తరగతి గదుల్లో డ్యూయల్ డెస్కులు, ఐఎఫ్ ప్యానెల్స్ పనితీరును ప్రత్యక్షంగా తిలకించారు. ప్రభుత్వ పాఠశాలల్ని గతంలో తాము ఎన్నడూ ఇంత గొప్పగా, ఇన్ని వసతులతో చూడలేదని అన్నారు. తరగతి గదుల్లో ఆధునిక ఫర్నీచర్, ఐఎఫ్ ప్యానెల్స్‌తో పాటు విద్యుద్దీకరణ, ఫ్యాన్లు, ఎల్‌ఈడీ లైట్లతో విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చుంటున్నారని తెలిపారు. బ్లాక్ బోర్డు స్థానంలో ఐఎఫ్ ప్యానల్స్ ద్వారా ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్న తీరు అద్భుతంగా ఉందని చెప్పారు. పేద విద్యార్థుల జీవితాలను మార్చే ఆధునిక డిజిటల్ టెక్నాలజీలతో కూడిన ఇంగ్లిష్ మీడియం చెప్పిస్తున్న సీఎం వై.ఎస్. జగన్ రాష్ట్రంలో చదువుల విప్లవం తెచ్చారని ప్రశంసించారు. అనంతరం పాఠశాలలో గార్డెన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. విజయలక్ష్మి, ఉర్దూ డీఐ షేక్ మొహ్మద్ ఖాసిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన సీఎం జగన్



పట్నంబజారు: ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి.. పేదల పక్షాన తానున్నానే భరోసాని కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 5వ డివిజన్ కుగ్లర్ ఆసుపత్రి, 15వ డివిజన్ రెడ్లబజారులో శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ నూరిఫాతిమా వెళ్లి సంక్షేమ పథకాల్ని వివరించడంతో పాటు ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్కటి అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. అందుకు భిన్నంగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి తాను పేదల పక్షపాతినని చాటి చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యాట్ల రవి, ఆంజనేయులు, దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో ఏపీకి జగనే ఎందుకు కావాలి ?

తూర్పు నియోజకవర్గంలోని 8,11,13,15,54 డివిజన్ల పరిధిలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా పాల్గొన్నారు. కార్యక్రమంలో నేతలు ఇర్రి ధనలక్ష్మి, రామన బోయిన అజయ్‌యాదవ్, ఆబిద్ బాషా, సంకూరి శ్రీను, మల్లవరపు రమ్య, అగ్గిపెట్టె రాజు, చిలకా రమేష్, ఆంజనేయులు, రవిరాజ్, దాసు, ఇర్రి సాయి, సతీష్, అంజిరెడ్డి, ముస్తఫా, కరీముల్లా, రమణ, నాగేశ్వరరావు, ఉస్మాన్ పాల్గొన్నారు.

- నాలుగో డివిజన్ వినోభానగర్ ఏడో లైనులో రూ. 12లక్షలతో తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

తైక్వాండోలో ప్రతిభ చూపిన విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్ పాఠశాలల తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి పోటీల్లో పాల్గొన్న 45 మంది విద్యార్థుల్లో పలువురు బంగారు, రజత, కాంస్య పతకాల్ని పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, జోనల్ ఇన్‌చార్జి అనురాధ అభినందించారు.

పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలి: ఏపీటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల్ని చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కోర్టు ఎదుట ఉన్న సంఘ జిల్లా కార్యాలయంలో శుక్రవారం గుంటూరు జోన్ కన్వీనర్ పి. నాగశివన్నారాయణ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బసవ లింగారావు మాట్లాడారు. ఉపాధ్యాయులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల్ని చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సరెండ్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు రెండేళ్ల క్రితమే పాస్ అయినప్పటికీ చెల్లింపులకు నోచుకోలేదని తెలిపారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణ చెల్లింపులు ఆర్నెల్లుగా నిలిచిపోవంతో దాచుకున్న సొమ్ము ఉపయోగపడటం లేదన్నారు. 11వ పీఆర్సీ బకాయిల చెల్లింపులు ఎప్పుడు జరుపుతారో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. 12వ పీఆర్సీని గత జూలై నుంచి మధ్యంతర భృతి ప్రకటించి అమలు చేయాలని, కేవలం కమిషన్ నియమించడం వల్ల ప్రయోజనం లేదని పేర్కొన్నారు. పాఠశాల నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యుత్ బిల్లులు తడిపి మోపెడవుతున్నాయని, కనెక్షన్లు తొలగిస్తామని విద్యుత్ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాలీద్, జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, జి.దాసు, జోసెఫ్ కిరణ్, మాణిక్యాలరావు, జిల్లా కౌన్సిలర్లు పి.లక్ష్మీనారాయణ, పార్వతి, కుటుంబరావు, గౌస్, కోటేశ్వరరావు, వేణు, శివశంకర నాయక్ పాల్గొన్నారు.

దివ్యాంగులు మనోధైర్యంతో ఎదగాలి



ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఎంఈవో నాగేంద్రమ్మ, డాక్టర్ చంద్రశేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: దివ్యాంగులు శారీరక వైకల్యాన్ని మరచి మనోధైర్యంతో ఎదగాలని గుంటూరు తూర్పు ఎంఈవో-2 కె.నాగేంద్రమ్మ పేర్కొన్నారు. రాజాగారితోటలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక అవసరాల బాల, బాలికల దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నాగేంద్రమ్మ శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన చిన్నారులకు సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలు, ఉపకరణాల గురించి తెలియజేశారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల్ని సద్వినియోగం చేసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పాఠశాలకు చెందిన విభిన్న ప్రతిభావంతుడైన ఉపాధ్యాయుడు నూతలపాటి వెంకటేశ్వర్లును సన్మానించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జె. గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు జి.వి.శ్రీధర్, భారతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్‌షిప్‌లో విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరావు, నాగ సౌజన్య

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్ పాఠశాలల తైక్వాండో చాంపియన్‌షిప్‌లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి పతకాలను కైవసం చేసుకున్నట్లు భారతి స్కూల్ డైరెక్టర్ బాపట్ల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నాగ సౌజన్య తెలిపారు. శ్రీనగర్ ఏడో లైనులోని స్కూల్లో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో వారు మాట్లాడారు. కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 9న జరిగిన తైక్వాండో చాంపియన్‌షిప్‌లో అండర్-8 విభాగంలో ఎం. తనుష, పి. ఇషా అలోకి రజత, ఎస్. సాజీదా కాంస్య, డి.సాహితి బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. అండర్-11 విభాగంలో షేక్ హనీఫా, ఐ. లక్ష్మీదుర్గ, షేక్ ఖాజా ఫజల్ బంగారు, షేక్ ఎండీ మౌసీ, షేక్ అనీఫ్, ఎం. సాత్విక్, సీహెచ్. వేదాంత రజత, పి. ఇషాన్ అధర్వ్ కాంస్య పతకాలు పొందారని పేర్కొన్నారు. అండర్-14 విభాగంలో ఎస్. దుర్గేష్ బంగారు, ఐ. మహేష్ బాబు కాంస్య పతకాలతో పాటు అండర్-17 విభాగంలో పి. వెంకటేష్, పి.తనుష్, షేక్ రసూల్, కె.వెంకటేశ్వర్లు బంగారు, పి. శ్రీకాంత్ రజత, ఎం. చైతన్య కాంస్య పతకాన్ని పొందారని తెలిపారు.

కాకాని శివాలయంలో శాస్త్రోక్తంగా యాగాలు ప్రారంభం

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి సన్నిధిలో శ్రీ కోటి లలితానామ జప యజ్ఞ పూర్వక ఏకాథ కుండాత్మక సప్తమ సహస్ర చండీ, మహారుద్ర , నవగ్రహ, లక్ష్మీ, గణపతి మహా యాగాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఏ ర్పాట్లను ఆలయ సహాయ కమిషనరు నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. తెనాలికి చెందిన విష్ణుభట్ల ఆంజనేయచయనులు పర్యవేక్షణలో శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు పూజా క్రతువు నిర్వహించనున్నట్లు ఏసీ తెలియజేశారు. తొలిరోజు శుక్రవారం ఉదయం 8 గంటలకు గురువందనం, గోపూజ, యాగ సంకల్పం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీగణపతి హోమం, చండీపారాయణములు, అఖండ దీపారాధన, జపాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మంటపారాధనలు, కుండ సంస్కారం, అగ్నిప్రతిష్ఠాపన, మూలసూత్ర హోమం, సహస్ర చండీ సప్తశతి హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో 50 మందికి పైగా ఋత్వికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు నగర డాక్టర్స్ విభాగంలో పలువురికి పదవులు కల్పిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ డాక్టర్స్ విభాగం నగర అధ్యక్షుడిగా మణియార్ షాషావలి, ఉపాధ్యక్షులుగా షేక్ యాస్మిన్, షేక్ కరిష్మా, ప్రధాన కార్యదర్శులుగా డి.నవ్య, మొహమ్మద్ షోయల్, షేక్ కరీముల్లా, షేక్ ఆరీఫ్, షేక్ ఉమర్, షేక్ ఉమర్‌ఫారూఖ్‌లను నియమించారు. కార్యదర్శులుగా బిల్లి వెంకటమల్లికార్జున, రణావత్ కృష్ణనాయక్, మూలె ఉపేంద్రరెడ్డి, కన్నెగంటి జ్యోతి, గోడ రమేష్, తగిరి భవ్య, షేక్ రిజ్వానా, గారా భాగ్యరేఖ, పి.నాగేంద్రరావు, దొప్పలపూడి ఆనందరావు, తేలుకుంట్ల వెంకటేశ్వర్లు, సయ్యద్ రెహమాన్‌బాబు, సహాయ కార్యదర్శులుగా కె.విజయకుమార్, డి.మనోహర్‌రావు, ఒడిచర్ల నాగార్జున రెడ్డి, బంటు శ్యామల, ఎం.నాగేశ్వరరావు, సయ్యద్ అబూకర్, పీట్ల గురవయ్య, పీట్ల వికాస్‌కుమార్, షేక్ ముజమల్లిబాషా, దుడ్ల అనూష, కంచి అనురాధ, కె.వి.కె.కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె

- తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ
- రెండో రోజుకు చేరిన నిరవధిక సమ్మె



సమ్మెలో ప్రసంగిస్తున్న రామకృష్ణ, పక్కన సంఘ నాయకులు

లక్ష్మీపురం: ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. అరండల్‌పేటలోని హెడ్ పోస్టాఫీసు వద్ద రెండో రోజు తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె కొనసాగింది. ఆయన మాట్లాడుతూ తమ సమ్మెకు అన్ని ఉద్యోగ సంఘాలు మద్దతు పలుకుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఎనిమిది గంటల పని, పెన్షన్ సహా అన్ని ప్రయోజనాల్ని మంజూరు చేయాలని కోరారు. సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి, ఆర్థిక ఉన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యూటీని రూ.5లక్షలకు పెంచాలని విన్నవించారు. పెయిడ్ లీవులను 180 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకునే సౌకర్యం, జీడీఎస్ వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన బంచింగ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి తమ గోడును వినాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి బాధాకరం



షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మరణించిన ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నివాళులర్పించారు. మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అదే సమయంలో ఎమ్మెల్సీ సాబ్జీ మరణ వార్త తెలియడంతో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆకస్మిక మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎస్. కుసుమ కుమారి, జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వి. శ్రీనివాస్, జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, ఏ.ఎల్. శివ పార్వతి, జిల్లా కోశాధికారి ఎండీ. దౌలా, కార్యదర్శులు కె. సాంబశివరావు, జి. వెంకటేశ్వరరావు, ఎం. గోవిందు, ఎం. కోటిరెడ్డి, ప్రభాజీ, పి. ప్రేమ్ కుమార్, జి.వి. ధనలక్ష్మి, టి. ఆంజనేయులు, అడవి శ్రీనివాసరావు, యు. రాజశేఖరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి పట్ల ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపాన్ని తెలియజేశారు. ఆయన మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాబ్జీ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

వైభవోపేతంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



స్వామి కల్యాణంలో పాల్గొన్న తులసి ధర్మచరణ్, యర్రంశెట్టి వేణుగోపాల్

గుంటూరు రూరల్: గోరంట్లలోని పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దశావతార కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మ చరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్‌తో కలసి ధర్మ చరణ్ సుదర్శన హోమంలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కల్యాణాన్ని ప్రారంభించారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని, భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కంచర్ల ఆంజనేయులు, గజవల్ల వెంకట అప్పారావు, ఆతుకూరి వెంకటేశ్వర్లు, కంచర్ల శంకరరావు, జవ్వాజి వెంకట సుబ్బారావు, గజవల్లి శివన్నారాయణ, గుండా వెంకట జగన్‌మోహన్ రావు, పూసల శివయ్య, జల్లేపల్లి మునలయ్య, పాటిబోలు పూర్ణచంద్రరావు, ఎర్రంశెట్టి రమేష్, దేవరశెట్టి సురేష్, ఓబులశెట్టి వెంకటనారాయణ, కందూరు వెంకటరెడ్డి, ఆళ్ల శివారెడ్డి, గోరంట్ల గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడాకారులకు ఆత్మవిశ్వాసమే విజయానికి సరైన మార్గమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలకు ఏఎన్‌యూ జట్టు తరఫున ఆడేందుకు తమ కళాశాల విద్యార్థినులు ఎన్నిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇటీవల బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీల్లో తమ కళాశాల బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించి రోలింగ్ ట్రోఫీని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో భారత దేశ కీర్తి బావుటా ఎగురవేసే స్థాయికి విద్యార్థులు తయారవ్వాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ కళాశాల విద్యార్థులు ఏ. శ్రీనిధి, డి.ఎ. బ్లేస్సీ ఈ నెల చెన్నైలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్-యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరఫున ఆడేందుకు ఎన్నికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, పీడీలు పి.గౌరీశంకర్, ఎం. శివరామకృష్ణ పాల్గొన్నారు.